సాక్షి రంగారెడ్డి

సోమవారం, 14, ఆగస్టు, 2023



కనుల పండువగా..

తలకొండపల్లి మండలం వెల్జాల్‌లోని వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది.

8లో▸



హామీలే తప్ప అమలు లేదు

బీఆర్‌ఎస్ ప్రభుత్వానివి హామీలే తప్ప అమలు చేసింది లేదని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి విమర్శించారు.

8లో▸



'డబుల్' అటకెక్కినట్లేనా?

రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెబుతున్నా నేటికీ పేదలకు అందలేదు.

8లో▸

న్యూస్‌రీల్

సహనాన్ని పరీక్షించొద్దు

పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: అధికార పార్టీ నేతలు తమ సహనాన్ని పరీక్షించొద్దని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్, బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తన స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాఖీ పండుగ విశిష్టతను తెలియజెప్పేందుకు ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామాల్లో పర్యటిస్తూ మహిళలకు పసుపు, కుంకుమ, చీర అందజేస్తున్నామని తెలిపారు. ఇది జీర్ణించుకోలేని అధికార పార్టీ నేతలు కొందరు తమ పై దాడులకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జిల్లేడు, గాలిగూడెం గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు తమపై దాడికి ప్రయత్నించారని పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు రావని మహిళలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. వారి కుట్రలు, బెదిరింపులకు భయపడేది లేదన్నారు. సమావేశంలో నాయకులు విజయ్ భాస్కర్, కుర్మయ్య, రుషికేష్, ఆకుల ప్రదీప్, నర్సింహ్మ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకదానికొకటి..

- వరుసగా మూడు వాహనాలు ఢీ
- రెండు కార్లు ధ్వంసం



ప్రమదానికి గురైన కార్లు

అబ్దుల్లాపూర్‌మెట్: విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం ఒకదానికొకటి వరుసగా మూడు వాహనాలు ఢీకొన్నాయి. ఫిల్మ్‌సిటీ గేటు ఎదుట హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందున్న కారును ఢీకొట్టడడంతో ఆ కారు దానికి ముందున్న మరో కారును ఢీకొంది. ఈ ఘటనలో రెండు కార్లు ముందు, వెనుక భాగాలు ధ్వంసం కాగా ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం కాలేదు. వరుసగా వాహనాలు ఢీకొనడంతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన వాహనాలను రోడ్డు పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ప్రమాదానికి గురైన ఇన్నోవా కారు యజమాని నాగరాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీత్లా పండుగలో ఉద్రిక్తత

- ఇరువర్గాల మధ్య ఘర్షణ
- గ్రామపెద్దల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



ర్యాలీలో ఘర్షణ పడుతున్న ఇరు వర్గాలు

యాచారం: మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లిలో ఆదివారం సీత్లా పండుగ సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలోని గిరిజన కుటుంబాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో ర్యాలీగా గ్రామ పొలిమేరలో ఉన్న దేవతా మూర్తుల విగ్రహాల వద్దకు బయలుదేరారు. ఓ వర్గం వారు మైకులు పెట్టి ఉత్సాహంగా బయలుదేరగా మరో వర్గం వారు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఘర్షణ ప్రారంభమైంది. ర్యాలీ మధ్యలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణులు వాగ్వాదానికి దిగారు. పోలీసులు రంగ ప్రవేశం చేసినా ఫలితం లేకుండాపోయింది. ఒకరినొకరు దూషించుకుంటూ బాహాబాహీకి దిగారు. ఓ వర్గం నుంచి ఎంపీటీసీ సభ్యురాలు కొర్ర జ్యోతి, మరో వర్గం నుంచి సర్పంచ్ విజయలక్ష్మి వర్గం వారు ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. ఎస్‌ఐ వెంకటనారాయణ తన సిబ్బందితో ఇరువర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. చివరికి గ్రామ పెద్దల జోక్యంతో ఇరువర్గాల వారు దేవతామూర్తులను దర్శించుకుని ఎవరికి వారు ఇళ్లకు చేరుకున్నారు. ముందు జాగ్రత్త చర్యగా గ్రామంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

39,702

గృహలక్ష్మికి గుట్టలుగా దరఖాస్తులు

- ప్రత్యేక కౌంటర్ల ద్వారా స్వీకరించిన అధికారులు
- నేటి నుంచి 20 వరకు అర్జీల పరిశీలన
- 25 నుంచి ఎమ్మెల్యేల సమక్షంలో చెక్కుల పంపిణీ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. గ్రామ కంఠం, మున్సిపాలిటీల్లో సొంత ఇంటి జాగ ఉండి, పక్కా ఇల్లు నిర్మించుకోవాలని భావించిన నిరుపేదలకు చేయూతను అందించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. నియోజకవర్గానికి మూడు వేల ఇళ్ల చొప్పున మంజూరు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ పథకం కింద ఎంపికైన వారికి మూడు విడతల్లో మొత్తం రూ.మూడు లక్షలు అందజేయనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం ఈ నెల 10 నుంచి 12 వరకు మండల, మున్సిపల్ కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించింది. రెండు రోజుల వ్యవధిలోనే జిల్లా వ్యాప్తంగా ఉన్న 27 మండలాలు, మూడు కార్పొరేషన్లు, 13 మున్సిపాలిటీల నుంచి 39,702 దరఖాస్తులు అందాయి. అధికారులు ఈ నెల 20 వరకు దరఖాస్తుల స్క్రూటినీ పూర్తి చేయనున్నారు. ఎమ్మెల్యేల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుంది. ఎంపిక చేసిన లబ్ధిదారులకు 25 నుంచి చెక్కులను అందజేయనున్నారు.

నేతల కనుసన్నల్లోనే..!

పారదర్శకంగా చేపట్టాల్సిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా రాజకీయ నేతల కనుసన్నల్లో జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే వారు గ్రామాలు, వార్డుల వారీగా అర్హుల జాబితా సిద్ధం చేసి ఉంచినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఎమ్మెల్యే, వారి అనుచరులు సిఫార్సు చేసిన వారి పేర్లనే జాబితాలో చేర్చుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే గృహలక్ష్మి పథకానికి సంబంధించిన పోర్టల్ ఇప్పటికీ సిద్ధం కాలేదు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఈ పోర్టల్‌ను తయారు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎంపిక చేసిన లబ్ధిదారుల పేరు, ఆధార్ నంబర్, బ్యాంక్ ఖాతా నంబర్‌ను పోర్టల్‌లో నమోదు చేయనున్నారు. ప్రభుత్వం ఇచ్చే నగదు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా బ్యాంకు ఖాతాల్లోనే జమకానుంది.

చెల్లింపులు ఇలా..

- నిర్మాణం బేస్‌మెంట్ లెవల్‌లో రూ.లక్ష.
- రూఫ్ లెవల్‌కు వచ్చిన తర్వాత రూ.లక్ష.
- నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.లక్ష చొప్పున మొత్తం మూడు లక్షలు నేరుగా లబ్ధిదారు ఖాతాలోనే జమవుతుంది.



ఇటీవల కందుకూరు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేందుకు క్యూ ..

జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులు..

నియోజకవర్గం	వచ్చిన దరఖాస్తులు
చేవెళ్ల	5,366
ఇబ్రహీంపట్నం	8,982
మహేశ్వరం	5,472
రాజేంద్రనగర్	2,342
కల్వకుర్తి	6,865
షాద్‌నగర్	10,675

నిబంధనలు ఇవే..

- గ్రామ కంఠం, మున్సిపాలిటీ పరిధిలో సొంతంగా ఇంటి జాగ కలిగి ఉండాలి.
- ఆ స్థలం సదరు లబ్ధిదారుడిదేనని నిరూపించే ఆనవాళ్లు ఉండాలి.
- డాక్యుమెంట్, ఇంటి నంబరు, విద్యుత్ బిల్లు, పన్ను చెల్లింపు రసీదులు ఉండాలి.
- ఓటరు కార్డు, ఆధార్‌కార్డు, ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలి.
- దరఖాస్తుదారు స్థానికురాలై ఉండాలి.
- మహిళ పేరునే ఇంటిని మంజూరు చేస్తారు.
- దరఖాస్తుదారు ఆర్‌సీసీ భవనం కలిగి ఉండరాదు.
- జీఓ నంబర్ 58,59 కింద లబ్ధి పొంది ఉండకూడదు.



తుక్కుగూడ: ముదిరాజ్ సంఘం భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని రావిర్యాలలో ఆదివారం ముదిరాజ్ సంఘ భవానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుల, చేతి వృత్తులకు కేసీఆర్ సర్కార్ అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఒక్కో కులానికి ఆత్మగౌరవ భవనాలను నిర్మిస్తున్నారన్నారు. రావిర్యాల ముదిరాజ్‌లకు ఓఆర్‌ఆర్ సమీపంలో అతి ఖరీదైన స్థలంలో రూ.20 లక్షలతో భవనం నిర్మించడం జరుగుతోందన్నారు. ముదిరాజ్‌ల సంక్షేమం కోసం, వారు ఆర్థికంగా ఎదిగేలా చెరువులో చేప పిల్లల వదలటం, వాటి మార్కెటింగ్ సౌకర్యం కోసం మొబైల్ వాహనాలను అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రాం, వైస్ చైర్మన్ భవాని వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ మౌనిక, ముదిరాజ్ సంఘం నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

మున్సిపల్ పరిధిలోని దేవేందర్‌నగర్‌కాలనీకి చెందిన ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆమె పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో తుక్కుగూడ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కోట్లాది రూపాయాలతో అభివృద్ధి

మీర్‌పేట్: సీఎం కేసీఆర్, ఐటీ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో కోట్లాది రూపాయాలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. కార్పొరేషన్‌లోని 4,7 డివిజన్లలో రూ.2.25 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణ ప్రగతిలో భాగంగా సమీకృత మార్కెట్, వైకుంఠధామాల నిర్మాణం, స్వచ్ఛతకు చిరునామాలుగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు నిలుస్తున్నాయన్నారు. కార్పొరేషన్ పరిధిలో ట్రంక్‌లైన్లు, నాలాల నిర్మాణాలతో వరద నీటి ముంపు సమస్యలకు పరిష్కారం చూపుతున్నట్లు తెలిపారు. బడంగ్‌పేట్, మీర్‌పేట్, జల్‌పల్లి, తుక్కుగూడ పరిధిలోని 11 చెరువుల్లో రూ.47 కోట్లతో అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు మంత్రి వివరించారు. కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్ లీడర్ భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు కామేష్‌రెడ్డి పాల్గొన్నారు.

తీగలతో మంత్రి సబితారెడ్డి భేటీ

వేదికైన తీజ్ వేడుక

- అరగంట పాటు మంతనాలు
- కొంతకాలంగా ఎడమొహం పెడమొహంగా ఉన్న నేతలు
- తాజా సమావేశంతో స్థానికంగా చర్చనీయాంశం

మహేశ్వరం: కొంత కాలంగా అసంతృప్తితో ఉన్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి ఆదివారం సాయంత్రం భేటీ అయ్యారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ మల్లాపూర్‌లో జరిగిన తీజ్ వేడుకకు ఇది వేదికైంది. ఈ వేడుకలకు మంత్రి సహా మాజీ ఎమ్మెల్యే హాజరయ్యారు. కొద్ది కాలంగా అంటీముట్టనట్లుగా ఉంటున్న ఆయన వచ్చే ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి తాను కూడా పోటీ చేస్తానని బహిరంగంగా ప్రకటించారు. తాజాగా ఇద్దరూ ఒకే వేదికపై కలుసుకొని రహస్య చర్చలు జరపడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. అలకపాన్పు ఎక్కిన తీగలను మంత్రి బుజ్జగించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వచ్చే ఎన్నికల్లో ఇద్దరం కలిసి పని చేద్దామని అరగంటపాటు చర్చించుకున్నట్లు సమాచారం. మంత్రి మెట్టు దిగి మాట్లాడడంతో ఆయన కొంత శాంతించినట్లు వినికిడి. కొంత కాలంగా తీగల పార్టీని వీడుతున్నారని పుకార్లు చెలరేగాయి. ఇద్దరు నేతల మధ్య రాజీ కుదరడంతో నియోజకవర్గంలో ఇప్పటి వరకు నెలకొన్న అంతర్గత విభేదాలు తొలగిపోయినట్టేనని బీఆర్‌ఎస్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇద్దరు నేతలు కలిస్తే వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తిరుగుండదని భావిస్తున్నారు.



తీగల కృష్ణారెడ్డితో మంత్రి సబితారెడ్డి

అందరినీ సమదృష్టితో చూడాలి

జాతీయ ఎస్సీ కమిషన్ వైస్ చైర్మన్ అరుణ్ హల్దర్

మీర్‌పేట: న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారందరినీ చిన్నా,పెద్దా తేడా లేకుండా సమదృష్టితో చూడాలని జాతీయ ఎస్సీ కమిషన్ వైస్ చైర్మన్ అరుణ్ హల్దర్ అన్నారు. మీర్‌పేట లెనిన్‌నగర్‌కు చెందిన విజయ్ సోలంకి తనకు ప్రాణహాని ఉందని మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదని ఆరోపిస్తూ ఈ నెల 1న స్టేషన్ ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. దీనిపై మృతుడి కుటుంబ సభ్యులు జాతీయ ఎస్సీ కమిషన్‌లో ఫిర్యాదు చేయగా ఆదివారం కమిషన్ వైస్ చైర్మన్ అరుణ్‌హల్దర్, రీజినల్ డైరెక్టర్ సునీల్‌కుమార్ బృందం లెనిన్‌నగర్‌కు వచ్చి విచారణ జరిపింది. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా అరుణ్ హల్దర్ మాట్లాడుతూ.. పోలీసులు సరైన సమయంలో స్పందించి ఉంటే ఒక మరణం జరిగి ఉండేది కాదని, గతంలో ఫారూఖ్ అనే వ్యక్తి విజయ్, అతని సోదరుడు రాజుపై కత్తితో దాడి చేసిన విషయంపై ఫిర్యాదు చేసినా స్పందన లేదని, విజయ్ ఆత్మహత్య చేసుకోవడానికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమని దుయ్యబట్టారు. సామాన్య ప్రజలను కొన్ని సందర్భాల్లో పోలీసులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా పోలీసులు తమ తీరును మార్చుకోవాలని హితవుపలికారు. విజయ్ కుటుంబ సభ్యులకు అన్ని విధాలా న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ అదనపు కలెక్టర్ మధుసూదన్, కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్, బాలాపూర్ తహసీల్దార్ మాధవీరెడ్డి, బీజేపీ దళితమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అరుణ్ హల్దర్

వెంటాడుతున్న బీపీ, తీపి

- చిన్న వయసులో చుట్టుముడుతున్న రుగ్మతలు
- పెరుగుతున్న రక్తపోటు, మధుమేహం బాధితులు
- జీవనశైలి, ఆహారపు అలవాట్లే కారణం
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు

షాబాద్: గతంలో వృద్ధాప్యం వచ్చాక రుగ్మతలు చుట్టుముట్టేవి. ప్రస్తుతం ఆధునిక జీవనశైలితో 30 ఏళ్ల వయసులోనే ముప్పేట దాడి చేస్తున్నాయి. వాతావరణం, ఆహారం, నీరు, ధ్వని, వాయు కాలుష్యం కారణంగా జనం ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడుపుతున్నారు. వెరసి యుక్త వయసులోనే మధుమేహం (షుగర్), అధిక రక్తపోటు (బీపీ) బారిన పడుతున్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో రెట్టింపు..

చిన్న వయసులోనే బీపీ, షుగర్ వ్యాధుల బారిన పడటంపై వైద్యనిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి అవగాహన కలిగి ఉండి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. వైద్యారోగ్య శాఖ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 30 ఏళ్ల వయసు దాటిన షుగర్ వ్యాధి గ్రస్తులు 84,564 మంది, అధిక రక్తపోటు వ్యాధిగ్రస్తులు, 58,398 మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్నారు. వీరే కాకుండా ప్రైవేటు ఆస్పత్రుల్లో రెట్టింపు సంఖ్యలో బాధితులు వైద్యం పొందుతున్నట్లు తెలిసింది.

సర్వేలో తేటతెల్లం..

జిల్లాలో మెట్రో సిటీ కల్చర్ వచ్చేసింది. ఫాస్ట్ ఫుడ్, జంక్‌ఫుడ్‌తో పాటు అన్ని రకాల ఆహార పదార్థాలు అందుబాటులోకి వచ్చాయి. ఇంట్లో వంటలు పక్కనబెట్టి, రెడీమేడ్ ఫుడ్ వైపు పరుగులు తీస్తున్నారు. అంతేవేగంగా వ్యాధులను కొని తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా బీపీ, షుగర్ వెంటాడుతున్నాయి. వైద్యారోగ్యశాఖ ఇటీవలి కాలంలో ఇంటింటి సర్వే చేపట్టగా షుగర్, బీపీ బాధితులు అధిక సంఖ్యలో ఉన్నట్లు గుర్తించారు.

వ్యాయామంతో షుగర్ కంట్రోల్..



హెచ్‌బీఏ1సీ పరీక్ష చేయించుకుంటే షుగర్ ఉందో లేదో తెలుస్తుంది. ఉదయాన్నే పరిగడుపున ఏమీ తినకుండా, తాగకుండా తీసిన రక్తంలో షుగర్ 100 లోపు ఉంటే వ్యాధి లేనట్లే. 100 నుంచి 126లోపు ఉంటే ప్రీడయాబెటిక్ దశలో ఉన్నట్లు లెక్క. ఈ దశలో జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధి రాదు. 140 నుంచి 200 వరకు ఉంటే డయాబెటిక్ దశలో ఉన్నట్లు లెక్క. షుగర్ 200 దాటితే వ్యాధి ఉన్నట్లు అర్థం. వ్యాయామం చేస్తే షుగర్‌ను కంట్రోల్‌లో ఉంచొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

హైబీపీకి చెక్ పెట్టొచ్చు..

ఉరుకుల, పరుగుల జీవితంలో కలిగే మానసిక ఒత్తిడితో కొన్నిసార్లు వంశపారంపర్యంగా బీపీ వచ్చే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఆహారంలో ఉప్పు, కారం, మసాలాలు తగ్గించాలి. బీపీ 120 బై 80కి మించకుండా చూసుకోవాలి. 60 ఏళ్లు దాటిన వారికైతే 130బై90 ఉన్నా పరవాలేదు. అంతకు మించి ఉంటే హైపర్ టెన్షన్ ఉన్నట్లే. బీపీని నిర్లక్ష్యం చేస్తే బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంటుంది. మందులతోపాటు మెడిటేషన్ చేస్తే దీనికి చెక్ పెట్టొచ్చని వైద్యులు చెబుతున్నారు.

కిడ్నీలకు ఎఫెక్ట్..



దీర్ఘకాలికంగా మధుమేహం ఉన్నవారు కిడ్నీ జబ్బుల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వ్యాధి వచ్చిన ఏడు నుంచి పదేళ్లలో కిడ్నీలు దెబ్బతింటాయి. ఊబకాయులకు సైతం ఈ ప్రమాదం ఉంటుంది. మధుమేహం రోగులు కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ శ్రీనివాస్ వడ్డే, జనరల్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్

హార్ట్, బ్రెయిన్‌స్ట్రోక్..



హై బీపీ ఉన్నవారు హార్ట్, బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు ఆందోళనకు గురై బీపీ పెరుగుతుంది. క్రమం తప్పకుండా చెక్ చేసుకుంటూ మందులు వాడుతూ, ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి.

– డాక్టర్ వరలక్ష్మి, చందనవెళ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

రాజకీయ నేతలను బార్డర్‌లో వేయాలి



మాజీ సైనికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

ఎమ్మెల్యే రఘునందన్‌రావు

బడంగ్‌పేట్: రాజకీయ నేతలను ఏడాది పాటు బార్డర్‌లో ఉంచితే సైనికుల క్రమశిక్షణ, దేశభక్తి, భారత రాజ్యాంగం, చట్టం విలువలు తెలుస్తాయని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం నాదర్‌గుల్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బడంగ్‌పేట కార్పొరేషన్‌లో నివాసం ఉంటున్న మాజీ సైనికులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నుకున్న పార్లమెంట్ సభ్యులను బఫున్లు అన్న సినిమా కమెడియన్‌పై (ప్రకాష్‌రాజ్) ఈసీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. దళిత, సైనికుల భూములను తెలంగాణ సర్కార్ లాగేసుకుంటుందని ఆరోపించారు. దేశం కోసం త్యాగాలు చేసిన సైనికుల కుటుంబాలకు చెందాల్సిన భూములు, స్థలాలు ఇచ్చేలా అసెంబ్లీలో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఆంధ్రాలో మాజీ సైనికుల భూములకు ఎన్ఓసీ ఇస్తుంటే ఇక్కడ కబ్జాలు చేస్తున్నారని కేసీఆర్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. నేటి నుంచి మూడు రోజుల పాటు హర్ ఘర్ తిరంగా ప్యార్ పేరుతో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని మోదీ పిలుపు నిచ్చాడని అన్నారు. అనంతరం విశ్రాంత త్రివిధ దళాల సైనికులను సన్మానించి మెమోంటోలను బహూకరించారు. పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొలాన్ శంకర్‌రెడ్డి, జంగయ్య, సుదర్శన్‌రెడ్డి, సుధాకరశర్మ, దేవేందర్‌రెడ్డి, మధన్‌మోహన్‌గుప్తా , పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ శ్రీధర్ రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మా భూములు దక్కేలా చూడండి



జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులకు వినతి పత్రం అందజేస్తున్న దళిత కుటుంబాలు

బడంగ్‌పేట్: కబ్జాలో ఉన్న తమ భూములు దక్కేలా చూడాలని బడంగ్‌పేటకు చెందిన దళిత కుటుంబాలు ఆదివారం జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులకు మొరపెట్టుకున్నారు. బడంగ్‌పేటలోని దావుత్ ఖాన్‌గూడలో సర్వేనె నంబర్-2లో ఉన్న భూమిని నమ్ముకుని తాతలు, తండ్రులు ఇప్పటి తరం వారు జీవిస్తున్నామన్నారు. సాగు భూమిలో ప్రభుత్వ భవనాలు నిర్మించారని మిగిలిన భూమినైనా నాడు సాగులో ఉన్న కుటుంబాలకు చెందేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. రెవెన్యూ అధికారులు సైతం మిగిలిన భూమిని దళిత కుటుంబాలకు కేటాయించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీమోర్చా తెలంగాణ అధ్యక్షుడు కొప్పు బాషా, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్ రెడ్డి, బీఎంసీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, తదితరులున్నారు.

లారీ బోల్తా.. బాలుడికి గాయాలు



నీటిలో బోల్తాపడిన లారీ

ఇబ్రహీంపట్నం: లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటన పట్నంలోని కృష్ణ వాటర్ పైపు లైన్ బైపాస్ రోడ్డు సమీపంలో కుంట వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మంచాల మండలం చాంద్‌ఖాన్‌గూడకు చెందిన యాదగిరి(40), మణి(12)తండ్రీ,కొడుకులు లారీలో వస్తున్నారు. నాగన్‌పల్లి వెళ్లేదారిలో మొగుళ్లవంపు కుంట నుంచి వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి లారీ కుంటలో పడింది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నీటిలో చిక్కుకున్న వారిని బయటకు తీశారు. బాలుడి చేతికి స్వల్ప గాయాలకాగా తండ్రి యాదగిరికి ఎలాంటి గాయాలు కాలేదు.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మితిమీరిన వేగంతో..

- డివైడర్‌ను ఢీ కొట్టిన డీసీఎం
- తప్పిన ప్రమాదం



డివైడర్ ఎక్కిన డీసీఎం

తుర్కయంజాల్: మితిమీరిన వేగంతో డీసీఎం వాహనాన్ని నడపడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన ఆదివారం సాగర్ రహదారిపై మన్నెగూడ వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బొంగ్లూర్ నుంచి తుర్కయంజాల్ వైపునకు వెళ్తుండగా మన్నెగూడ చౌరస్తా వద్దకు రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. డివైడర్‌పై ఉన్న చెట్ల నుంచి వెళ్లడంతో వాహనం ఆగిపోయింది. దీంతో ఎలాంటి ప్రమాదం జరగాలేదు.

‘డబుల్’ అటకెక్కినట్లేనా?

- ఏడేళ్లుగా పూర్తికాని డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- నురంగల్‌లో అర్ధాంతరంగా నిలిచిపోయిన వైనం



అసంపూర్తిగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం

మొయినాబాద్: రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెబుతున్నా నేటికీ పేదలకు అందలేదు. అక్కడక్కడ కొన్ని డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినా నిర్మాణాలు మాత్రం అసంపూర్తిగానే ఉన్నాయి. మొయినాబాద్ మండలంలోని సురంగల్, అజీజ్‌నగర్, కనకమామిడి, చిలుకూరు, చిన్నమంగళారం, తోలుకట్ట తదితర గ్రామాలకు 2016లో ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేసింది. దీంతో అప్పటి రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా పలు గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తరువాత రెండేళ్లకు సురంగల్, అజీజ్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టారు. కానీ, ఇప్పటి వరకు అవి పూర్తి కానే లేదు. సురంగల్‌కు 20 డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు కాగా 16 మాత్రమే నిర్మిస్తున్నారు. మరో నాలుగు డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టనేలేదు. ఆరు నెలల క్రితం డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చేందుకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశారు. కానీ, నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో ఇంత వరకు ఇళ్లు ఇవ్వలేదు. మిగిలిన చోట్ల శిలాఫలకాలు వేసి వదిలేశారే తప్పా పనులు మాత్రం మొదలు పెట్టలేదు. ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకాన్ని పక్కనపెట్టి గృహలక్ష్మి పథకం తీసుకురావడంతో ఇక డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఆశించినవారికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరిక

మంత్రి సబితారెడ్డి



సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

మహేశ్వరం: బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో స్వచ్ఛందగా చేరుతున్నారని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అమీర్‌పేట్, సిరిగిరిపురం గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నేతలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా మహేశ్వరం గడ్డపైన ఎగిరేది గులాబీ జెండానే అన్నారు. తాను చేసిన అభివృద్ధి, సంక్షేమమే భారీ మెజార్టీతో గెలిపిస్తాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ వంటి కార్యక్రమాలే బీఆర్ఎస్ పార్టీని మూడోసారి గెలిపిస్తాయని ఆమె పేర్కొన్నారు. త్వరలో మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి భారీ ఎత్తున బీఆర్ఎస్‌లోకి చేరికలు ఉంటాయన్నారు. పార్టీలో చేరిన వారిలో ఎండీ.సమీర్, చాకలి ప్రవీణ్, విజయ్, ప్రవీణ్, ఈదయ్య, నర్సింహ, డీవీఎస్‌రెడ్డి, పాండు చారి, సత్యనారాయణ చారి, రమేష్, లింగం పలువురు చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాయప్ప, అమీర్‌పేట్ ఉప సర్పంచ్ పోతుల నర్సింగ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేవరం గౌడ్, మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, వార్డు సభ్యులు రాజు, గ్రామశాఖ అధ్యక్షుడు వెంకటేష్, కో ఆప్షన్ సభ్యుడుఅశోక్, నర్సింహ పలువురు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

కల్యాణానికి హాజరైన భక్తులు



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

తలకొండపల్లి: మండలంలోని వెల్జాల్‌లోని వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయాన్ని రంగు రంగుల పూలు, విద్యుదీపాలతో చక్కగా అలంకరించారు. బాజా భజంత్రీలు, మంగళవాయిద్యాల మధ్య లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ విగ్రహాలను శావ తీశారు. లోక కళ్యాణార్థం వేద పండితులు శ్రీనివాసా మూర్తి, మురళీకృష్ణల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు సమకూర్చిన పట్టు పీతాంబు వస్త్రాలను ఉత్సవ విగ్రహాలకు ధరింపజేశారు. విగ్రహాలను ఆలయ మండపానికి తీసుకొచ్చి కల్యాణానికి ముస్తాబు చేశారు. అర్చక, పూజారులు వేద మంత్రాలు చదువుతుండగా ముత్యాల తలంబ్రాలతో మంగళసూత్రధారణ గావించారు. భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. గోవిందనామస్మరణతో వేదాద్రి మార్మోగిపోయింది. కన్నుల పండువగా జరిగిన ఈ కార్యక్రమానికి హైదరాబాద్, షాద్‌నగర్, శంషాబాద్, తదితర పట్టణాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సంగీత, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాసుయాదవ్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రవికుమార్, ఎంపీటీసీ అంబాజీ, ఉప సర్పంచ్ అజీజ్, నాయకులు విష్ణువర్ధన్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, అశోక్‌గుప్తా, కృష్ణ, నరేందర్‌గౌడ్, అర్చక వేద, పూజారులు నరసింహ్మశర్మ, భరద్వాజ శర్మ, యాదగిరిశర్మ, కృష్ణశర్మ, దినేష్‌శర్మ, శశాంక్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, కేదార్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌వి హామీలే తప్ప అమలు లేదు

యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న నాయకులు

మొయినాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వానివి హామీలే తప్పా అమలు చేసిందిలేదని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దర్శన్ అన్నారు. మండలంలోని మేడిపల్లిలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. యువకులు, మహిళలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగాల కోసం లక్షలాది మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు సబ్సిడీలు ఎత్తేసి, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా మోసం చేస్తుందని విమర్శించారు. ప్రజలంతా నిరాశతో ఉన్నారని.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి సతీష్, నియోజకవర్గం నాయకుడు వసంతం, మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, యువజన కాంగ్రెస్ నియోజవకర్గం అధ్యక్షుడు పెంటారెడ్డి, మండల అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్‌లు చంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఏబ్లాక్ అధ్యక్షుడు మల్లారెడ్డి, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు సత్యనారాయణ, వాసుదేవ్, నాయకులుపాల్గొన్నారు.

నిమ్స్ సెక్యూరిటీ సిబ్బందికి ఉచిత వైద్య సేవలు

లక్డీకాపూల్ : నిమ్స్ ఆస్పత్రిలో ఏజెన్సీల ద్వారా పని చేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి ఉచిత వైద్య సేవలను అందించనున్నట్టు నిమ్స్ డైరెక్టర్ నగర బీరప్ప తెలిపారు. వారి వేతనాల సమస్యలను కూడా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో ఆదివారం సెక్యూరిటీ ఏజెన్సీల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కొత్తగా టెండర్లు దక్కించుకున్న కార్తీక సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా 140 మంది సిబ్బందిని, 12మందిని మాజీ సైనిక అధికారులను సెక్యూరిటీ ఆఫీసర్స్ గా నియమించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి డైరెక్టర్ మాట్లాడుతూ.. నిమ్స్‌కు వచ్చే రోగులు, వారి సహాయకులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. ఆస్పత్రి ప్రాంగణంలో వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా నిర్దేశించిన పార్కింగ్ స్థలంలో నిలిపేలా సూచనలు చేయాలని చెప్పారు. సిబ్బందికి వేతనాలు చెల్లింపుల్లో ఏజెన్సీలు జాప్యం చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని, ఇక నుంచి అలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. అంతే కాకుండా సెక్యూరిటీ సిబ్బందికి విధి నిర్వహణలో ఏదైనా అనారోగ్య సమస్యలు, అత్యవసర వైద్యం అవసరమైతే ఉచితంగా అందిస్తామన్నారు. మహిళా సిబ్బంది పట్ల అనుచితంగా ప్రవర్తించినా, వేధింపులకు గురి చేసినా సహించేది లేదన్నారు. ఈ క్రమంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఎవరికైనా సమస్య వస్తే ఆ కమిటీకి ఫిర్యాదు చేయాలని డైరెక్టర్ సూచించారు. సమావేశంలో మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ లు డాక్టర్ ఎస్. లాక్ష్మీ భాస్కర్, డాక్టర్ కే.వీ.కృష్ణారెడ్డితో పాటు సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

జీడిమెట్ల: చెట్టుపై నుంచి పడిన వ్యక్తి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన మేరకు.. సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన సతీష్(33), నీలవేణిలు భార్యభర్తలు. వీరికి భవశ్రీ(11), నిరుపమ్(09) పిల్లలున్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు సతీష్ బయటకు వెళ్లగా, నీలవేణి డ్యూటీకి వెళ్లింది. మధ్యాహ్నం స్థానికంగా ఉన్న వ్యక్తులు నీలవేణికి ఫోన్ చేసి నీ భర్త చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడని చెప్పడంతో వెంటనే ఇంటికి చేరుకోగా అప్పటికే రక్తపు మడుగులో ఉన్న భర్త మృతి చెందాడు. నేరేడు పండ్లను కోసేందుకు చెట్టు ఎక్కగా కొమ్మ విరిగిపడటంతో సతీష్ రోడ్డుపై పడ్డాడని, తలకు తీవ్రగాయం కావడంతో మృతి చెందినట్లు మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినికి వేధింపులు.. ప్రిన్సిపాల్ అరెస్టు

రాజేంద్రనగర్: పాఠశాలలో చదువుతున్న విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేస్తున్న ప్రిన్సిపల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రతిరోజు వేధిస్తు నానా ఇబ్బందులకు పాల్పడుతున్న ప్రిన్సిపల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాలిక తల్లిదండ్రులు,కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ సిఐ మధు తెలిపిన మేరకు.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ శ్రీరామ్‌నగర్‌లోని రాకేష్ విద్యానికేతన్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినితో ప్రిన్సిపల్ గత నెల రోజులుగా అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. దీంతో విద్యార్థిని ఈ విషయం ఆదివారం తల్లిదండ్రులకు చెప్పింది. ఆగ్రహించిన తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని నిలదీసింది. అలాంటివేమీ జరగడం లేదని చెప్పుకోచ్చింది. దీంతో బాలిక తల్లిదండ్రులు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీసులు రంగంలోకిదిగి పాఠశాలలో జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు .ప్రిన్సిపల్ శంకర్‌ను అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక దాడికి పాల్పడి.. సౌదీకి చెక్కేశాడు..

బంజారాహిల్స్: ప్రేమించానని నమ్మించి.. పెళ్లి చేసుకుంటానని మభ్యపెట్టి యువతిని మోసం చేసిన యువకుడిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాలు.. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఓ యువతి ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి సికింద్రాబాద్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటోంది. ఎనిమిది నెలల క్రితం ఆమెకు షేర్ చాట్ యాప్‌లో సౌదీ అరేబియాలో నివసించే కె. బాలరాజు అనే యువకుడు పరిచయం అయ్యాడు. ఈ స్నేహం కాస్త ప్రేమకు దారి తీసింది. గాఢంగా ప్రేమిస్తున్నట్లు చెప్పిన ఆ యువకుడు పెళ్లి చేసుకుంటాని కూడా మాటిచ్చాడు. జూన్ 15వ తేదీన సౌదీ అరేబియా నుంచి నగరానికి వచ్చిన బాలరాజు బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని హ్యాపీ హోమ్స్ ఓయో రూమ్‌లో బస చేశాడు. హాస్టల్ నుంచి ఆమెను ఓయో రూమ్‌కు రప్పించి పెళ్లి చేసుకుంటానని చెప్పి రెండు రోజుల పాటు ఆమెతోనే ఉన్నాడు. మూడో రోజున తన స్వగ్రామం అయిన కరీంనగర్ జిల్లా వెంకట్రావ్‌పల్లికి వెళ్లి 15 రోజుల తర్వాత వస్తానని చెప్పాడు. బాధిత యువతి కూడా తన స్వగ్రామానికి వెళ్లిపోయి రెండు వారాల తర్వాత బాలరాజుకు ఫోన్ చేసింది. తన తల్లికి బాలేదని ఒకసారి, ఇంకా పనులు ఉన్నాయంటూ మరోసారి తప్పించుకున్నాడు. ఇటీవల ఆమె ఫోన్ చేయగా ఇంకో నెల సమయం కావాలని చెప్పాడు. దీంతో ఆమె మూడు రోజుల క్రితం ఫోన్ చేయగా అప్పటికే బాలరాజు సౌదీ అరేబియాకు వెళ్లిపోయినట్లు చెప్పాడు. నిన్ను పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదు. నీ చావు.. నువ్వు చావు అంటూ ముఖం చాటేశాడు. మోసపోయానని తెలుసుకున్న బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.